సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 28 । జూలై । 2024



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 998 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.27
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.27, కనిష్టంగా రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 15 మండలాల పరిధిలో తుంపర్లు పడ్డాయి. మడకశిర మండలంలో 7.2 మి.మీ, గుడిబండ 5.8, ఓడీచెరువు 5.4, బత్తలపల్లి, ఎన్పీ కుంట, నల్లమాడ మండలాల్లో 4.4 మి.మీ, రొళ్ల 4.2, గాండ్లపెంట 3.8, ముదిగుబ్బ 3.2, నల్లచెరువు 3, తలుపుల, అమరాపురం 2.4, కదిరి, కొత్తచెరువు 2.2, తాడిమర్రిలో 1.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

గుడిబండ కొండపై చిరుత సంచారం



కొండపై చిరుత సంచరిస్తున్న దృశ్యం

గుడిబండ: చిరుత సంచారం కలకలం రేపుతోంది. శనివారం గుడిబండ సమీపంలోని కొండపై చిరుత కనిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పటికే చుట్టుపక్కల గ్రామాల్లోని మేకలు, గొర్రెలు, పశువులపై దాడి చేసిన చిరుత తాజాగా మండల కేంద్రం సమీపంలో కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పశువులపై దాడి చేసి ప్రాణాలు తీస్తోందని, ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు చొరవ తీసుకుని చిరుతను బంధించి అటవీ ప్రాంతంలో వదలాలని కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా సెక్రటరీ పోస్టుకు వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మీనాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎక్కువ కాలం పనిచేసిన వారు అర్హులన్నారు. సెక్రటరీ పదవీకాలం రెండేళ్లు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీలోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

'ఉత్తమ' అవార్డుకు టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ టీచర్ అవార్డ్–2024కు అర్హులైన టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా పరిషత్, మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కనీసం 15 ఏళ్ల బోధన అనుభవం కల్గి ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు / ఆర్టికల్ ఆఫ్ చార్జెస్/ శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదన్నారు. ఆగస్టు 5వ తేదీలోపు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నవోదయ విద్యాలయం.. విద్యార్థులకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయం గ్రామీణ విద్యార్థులకు వరం లాంటిదని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం లేపాక్షిలోని నవోదయ విద్యాయంలో జరిగిన యాజమాన్య కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నవోదయ విద్యాలయాల్లో చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని తెలిపారు. ఇక్కడ నాణ్యమైన చదువుతో పాటు క్రీడల్లో రాణించడానికి అనువైన వాతావరణం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ వాసుదేవగుప్తా, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. చోద్యం



- నల్లచెరువు మండలం తిరుమలదేవరపల్లికి చెందిన ఓ రైతుకు చెందిన ఎద్దు వారం రోజుల క్రితం తీవ్ర అనారోగ్యం బారిన పడింది. దీంతో సదరు రైతు సంచార పశువైద్య సేవల కోసం 1962 నంబర్‌కు ఫోన్ చేయగా..డ్రైవర్ లీవ్‌లో ఉన్నాడని, రావడం కుదరదని సిబ్బంది తెలిపారు. ఏం చేయాలో తెలియక ఎద్దును ప్రైవేటు వాహనంలో అతికష్టమ్మీద కదిరికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకున్నాడు.

- గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లికి చెందిన ఓ రైతుకు చెందిన పాడి ఆవు మేత మేయడం మానేసింది. దీంతో ఆవుకు చికిత్స చేయించేందుకు రైతు మూడు రోజుల క్రితం 1962 నంబర్‌కు ఫోన్ చేయగా.. సిబ్బంది స్పందించక పోగా రైతుపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనం ఆగిపోయి 10 రోజులవుతోందని, అసలు విషయం చివర్లో చెప్పారు.

...ఇలా వివిధ కారణాలతో జిల్లాలో పాడి పశువులు, మూగజీవాలకు వైద్య సేవలు అందడం లేదు. వాహనాలు మొరాయించడం, మందులు అందుబాటులో లేకపోవడంతో సంచార పశు వైద్యం పూర్తిగా పడకేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూగ వేదన
- జిల్లాలో నిలిచిన సంచార పశు వైద్య సేవలు
- అందుబాటులో లేని మందులు.. పని చేయని పరికరాలు
- జీతాలు రాక పశు ఆరోగ్య సేవ సిబ్బంది అవస్థలు
- నిర్వహణ నిధులూ విడుదల చేయని చంద్రబాబు సర్కారు

కదిరి: సంచార పశువైద్య సేవలను చంద్రబాబు ప్రభుత్వం అటకెక్కిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా మూగ జీవాలకూ మొబైల్ అంబులెన్స్ సేవలను గత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అమలులోకి తెచ్చింది. పాడి పశువులు, మూగ జీవాలకు ఏదైనా వ్యాధి సోకినా..పశువులు అనారోగ్యం బారిన పడినా... 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు... వైద్య సేవలు అందించే మొబైల్ వాహనం ఇంటి ముందు వచ్చి ఆగేది. కానీ ఈ ప్రభుత్వం సంచార పశువైద్య సేవలపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

2022 మే నెల19వ తేదీన అప్పటి జగన్ ప్రభుత్వం 'డా.వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలు' ప్రారంభించింది. జిల్లాలోని రాప్తాడు, సీకే పల్లి, మడకశిర, గుడిబండ, హిందూపురం, లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల, ధర్మవరం, బత్తలపల్లి, పుట్టపర్తి, ఓడి చెరువు, కదిరి, తలుపుల... ఇలా మొత్తంగా 14 వాహనాల ద్వారా జిల్లాలో సంచార పశువైద్య సేవలు అందించేవారు. అయితే రెండు నెలలుగా పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురంలోని సంచార పశువైద్య వాహనాలు మరమ్మతుల కారణంగా ఆగిపోయాయి. కదిరిలో గత కొన్ని రోజులుగా ఆ వాహన డ్రైవర్ కమ్ అటెండర్ సెలవులో ఉన్నందున వాహనం షెడ్‌కే పరిమితమైంది. ఇలా వివిధ కారణాలతో సంచార పశువైద్య సేవల వాహనాలు ఆగిపోవడంతో ఆయా ప్రాంతాల్లో వైద్యం అందక ఎంతో విలువైన పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.

వేతనాల కోసం ఎదురు చూపు..

సంచార పశువైద్య సేవల సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. సకాలంలో జీతాలు ఇవ్వకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కేంద్ర నిబంధనల ప్రకారం వైద్యుడికి రూ.57 వేలు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో సిబ్బంది తమకు న్యాయమైన వేతనాలు ఇవ్వాలని అడుగుతుంటే వారికి నోటీసులిచ్చి బెదిరింపులకు దిగుతున్నారు.

సేవలు ఘనం.. అమలు అంతంత మాత్రం..

అత్యవసర పశువైద్య సేవలకు ఉపయోగపడే సంచార పశువైద్యశాలలో డాక్టర్, పారావెట్‌తో పాటు అటెండర్ కమ్ డ్రైవర్ ఉంటారు. ఎవరైనా 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే వాహనం నిర్దేశిత ప్రాంతానికి చేరుకోవాలి. పశువుకు హిస్టరెక్టమీ సహా పలు చికిత్సలు, 20 రకాల పేడ పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా 54 రకాల పరికరాలు, మందులు భద్ర పరిచేందుకు సదరు వాహనంలో ఒక మినీ ఫ్రిజర్ కూడా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి అంబులెన్స్‌లో మొత్తం రూ.35 వేల విలువైన 81 రకాల మందులను అప్పటి ప్రభుత్వం ఎప్పుడూ అందుబాటులో ఉంచేది. కదల్లేని స్థితిలో ఉన్న పశువులను హైడ్రాలిక్ సాయంతో వాహనంలోకి ఎక్కించి, దగ్గరలోని పశువైద్యశాలలో చికిత్స ఇప్పించి, తిరిగి రైతు ఇంటివద్ద దింపి వెళ్లే విధంగా గత జగన్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. ప్రస్తుతం కనీసం ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని సిబ్బంది వాపోతున్నారు. సేవల జాబితా గొప్పగా ఉన్నా.... చంద్రబాబు సర్కార్ ఇవేమీ అందుబాటులో ఉంచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కదిరిలో డ్రైవర్ లేక ఆగిపోయిన సంచార పశువైద్య సేవల వాహనం

సిబ్బంది సెలవు పెడితే వైద్య సేవలు బంద్..

గత జగన్ సర్కార్ సంచార పశువైద్య సేవలకు పెద్దపీట వేసింది. వాహనంలో పనిచేసే పశు వైద్య సిబ్బంది వారాంతపు సెలవులో ఉన్నా... సెలవులో ఉన్నా... వైద్య సేవలు ఆగేవి కాదు. వారి స్థానంలో మరికొందరు విధులు నిర్వర్తించేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. సిబ్బంది వీక్లీ ఆఫ్‌లో ఉంటే ఆ ప్రాంతంలో ఆ రోజు మూగ జీవాలకు వైద్య సేవలు బంద్ అవుతాయి. ప్రతి సోమవారం రాప్తాడు, పుట్టపర్తి, మంగళవారం మడకశిర, కదిరి, బుధవారం సీకే పల్లి, ఓడి చెరువు, గురువారం గోరంట్ల, ధర్మవరం, శుక్రవారం గుడిబండ, పెనుకొండ, శనివారం లేపాక్షి, బత్తలపల్లి, ఆదివారం హిందూపురం, తలుపుల ప్రాంతాల్లోని సిబ్బంది వారాంతపు సెలవులో ఉంటున్న కారణంగా ఆయా రోజుల్లో సంచార వైద్య సేవల వాహనాలు షెడ్‌కే పరిమితమవుతున్నాయి.

ఆగిపోయినా ఆశ్చర్యం లేదు



గత ప్రభుత్వ హయాంలో 1962 నంబర్‌కు ఫోన్ చేయగానే వెహికల్ వచ్చి ఇంటిముందు ఆగేది. పశువుకు ఏదైనా తీవ్ర అనారోగ్యం సంభవిస్తే ఆ వెహికల్‌లోనే తీసుకెళ్లి వైద్యం చేసి మళ్లీ ఇంటికి తీసుకువచ్చే వారు. రైతు నుంచి ఒక్క రూపాయి తీసుకునేవారు కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు. ఈ సేవలు జగన్ హయాంలో ప్రారంభమయ్యాయి కాబట్టి.. మనం చేసినా ఆయనకే మంచిపేరు వస్తుందని చంద్రబాబు సర్కార్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో సంచార పశువైద్య సేవలు ఆపేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

– అశోక్‌వర్ధన్‌రెడ్డి, రైతు, తనకల్లు

మరమ్మతుల కారణంగా ఆగాయి



గ్రామాలకు వెళ్లి పశువులకు సంచార వైద్య సేవలు అందించే వాహనాలు మరమ్మతుల కారణంగా కొన్ని ఆగి ఉండవచ్చు. ఈ విషయం పత్రికల్లో రాస్తే మరీ మంచిది. ప్రజలకు కూడా ఈ విషయం తెలుస్తుంది. మొబైల్ వాహనాల్లో కొన్ని మందులు అందుబాటులో లేని మాట కూడా వాస్తవమే. త్వరలోనే అన్ని సమస్యలూ పరిష్కారమయ్యేలా చూస్తాం.

– శుభదాస్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక
- గోళ్లాపురంలో టీడీపీ నేతల దాడిలో మృతి చెందిన సతీష్ కుటుంబానికి పరామర్శ
- పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.5 లక్షల చెక్కు అందజేత



సతీష్ కుటుంబీకులకు రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: 'అధికారం కోల్పోయామని ఎవరూ అధైర్య పడవద్దు. ప్రజల పక్షాన పోరాడదాం. ప్రజల తరపున ఈ ప్రభుత్వాన్ని నిలదీద్దాం. హత్యా రాజకీయాలను మూకుమ్మడిగా ఖండిద్దాం. పార్టీ నుంచి కావాల్సిన సహాయ సహకారాలు కూడా అందుతాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మాటగా చెబుతున్నాం. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, పార్టీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఈనెల 3వ తేదీన టీడీపీ నేతల దాడిలో మృతి చెందిన గోళ్లాపురం సతీష్ కుటుంబాన్ని శనివారం వారు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ, రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, కానీ టీడీపీ నేతలు అధికారం అండతో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు దిగడం దుర్మార్గమన్నారు. హిందూపురంలో హత్యా రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వాటికి చోటు లేదన్నారు. అయినా వారి దౌర్జన్యాలకు భయపడేది లేదన్నారు. ప్రజల కోసం అన్యాయాలపై ఎదిరించి పోరాడతామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ పరంగా చిన్న చిన్న ఇబ్బందులు ఏవైనా ఉంటే కచ్చితంగా తాము అండగా ఉంటామన్నారు. ఎక్కడ..ఎవరికి... ఏచిన్న ఇబ్బంది ఎదురైనా తనకు సమాచారం అందించాలని, తక్షణం స్పందిస్తామన్నారు.


నిండు ప్రాణం తీయడం అన్యాయం..

సతీష్ రెక్కల కష్టంపైనే ఆ కుటుంబమంతా ఆధారపడి జీవనం సాగించేదని, రాజకీయ కక్షతో అలాంటి వ్యక్తిని హతమార్చి ఆ కుటుంబాన్ని దిక్కులేని వారిని చేశారని టీడీపీ నేతలపై నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతం కాదన్న విషయం అందరూ గుర్తించాలన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలెవరూ భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ తాము అండగా ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాము, గ్రామ సర్పంచ్ దేవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు షామీంతాజ్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్ వాల్మీకి, కౌన్సిలర్లు ఇర్షాద్ అహ్మద్, ముస్తక్ అహ్మద్, తిప్పే రుద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగనాథ్, రామాంజి, నవీన్, ముభారక్, దాదు, కిష్టప్ప, శ్రీనివాసులు, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన పలువురు తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ చేతన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ జిల్లాల నుంచి 26 మంది తహసీల్దార్లు జిల్లాకు రాగా, వారందరినీ తిరిగి పంపారు. సోమందేపల్లి తహసీల్దార్ అంజనాదేవిని నంద్యాల జిల్లాకు, కొత్తచెరువు తహసీల్దార్ కళావతిని చిత్తూరు జిల్లాకు, అగళి, తాడిమర్రి, పుట్టపర్తి, హిందూపురం, బత్తలపల్లి, పరిగి, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నజ్మాభాను, వేణుగోపాల్, శివప్రసాద్ రెడ్డి, శివశంకర్ నాయక్, రాజేశ్వరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వసుంధరలను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. బుక్కపట్నం, తలుపుల, రొద్దం, అమరాపురం, లేపాక్షి, ముదిగుబ్బ, ధర్మవరం, రొళ్ల, గుడిబండ తహసీల్దార్లు భారతి, రామకుమారి, లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య, బాలనరసింహులు, సరస్వతి, రమేష్, భద్రుజమ, ప్రతాప్ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటస్వామిలను వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేశారు. అలాగే నల్లమాడ, పెనుకొండ, ఓడీచెరువు, కదిరి, చిలమత్తూరు, గాండ్లపెంట తహసీల్దార్లు నాగభూషణం, ఉదయ్‌శంకర్ రాజు, ఖాజాబీ, పుల్లారెడ్డి, భాగ్యలత, శ్రావణిలను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. ఇక జిల్లాలో రిపోర్టు చేసుకున్న తహసీల్దార్ శివరామన్‌ను చిత్తూరు జిల్లాకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

1న జిల్లాకు సీఎం చంద్రబాబు



మడకశిర రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగస్టు 1వ తేదీన జిల్లాకు విచ్చేస్తున్నారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ (ఎన్టీఆర్ భరోసా) కోసం ఆయన మడకశిర మండలం గుండుమల గ్రామానికి విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టర్ చేతన్, ఎస్పీ వి. రత్న, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ వేర్వేరుగా గుండుమలలో పర్యటించారు. తొలుత కలెక్టర్ చేతన్ అధికారులతో కలిసి ఏర్పాట్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎస్సీ కాలనీలో పింఛన్ లబ్ధిదారులను గుర్తించారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఎస్పీ వి.రత్న గుండుమలకు విచ్చేసి హెలిప్యాడ్ స్థలాన్ని, సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలతో మాట్లాడారు. వీరి వెంట డీఎస్పీ షేక్ బాబీజాన్‌సైదా, తహసీల్దార్ వెంకటేష్, సీఐలు మనోహర్, రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ చంద్రప్ప, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

జానపదం.. భక్త పరవశం

ప్రశాంతి నిలయం: హిమాచల్ జానపదంతో సత్యసాయి భక్తులు పరవశం చెందారు. సత్యసాయి బాబా వైభవాన్ని చాటుతూ హిమాచల్ ప్రదేశ్ చిన్నారులు నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శన భక్తులను మైమరపించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన హిమచల్ ప్రదేశ్ సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ చిన్నారులు చక్కటి నృత్య భంగిమలతో అలరించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ కచేరీ నిర్వహించారు.



జానపద నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న బాలవికాస్ చిన్నారులు

తనబిడ్డ అనుకొని... మరొకరి బిడ్డను..

- హిందూపురం ఆస్పత్రిలో పసికందును తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తి
- అడ్డుకుని వార్డులోనే బంధించిన బాలింత బంధువులు, నర్సులు
- పోలీసుల రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి..



బిడ్డకు ఎత్తుకెళ్లదానికి ప్రయత్నించిన ఇలియాజ్



సౌజన్య శిశువు

హిందూపురం టౌన్: తన బిడ్డ అనుకుని మరొకరి బిడ్డను ఆస్పత్రి నుంచి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శనివారం హిందూపురం ఆస్పత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. పరిగి మండలం జంగాలపల్లికి చెందిన సౌజన్య పురిటి నొప్పులతో శనివారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు వైద్యులు ప్రసవం చేయగా, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రాత్రి పసికందును నానమ్మ ఆస్పత్రిలోని బెడ్‌పై పడుకోబెట్టగా...లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన మహమ్మద్ ఇలియాజ్ అనే వ్యక్తి బెడ్‌పై ఉన్న బిడ్డను ఎత్తుకుని వడివడిగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అక్కడే ఉన్న శిశువు నానమ్మ గట్టిగా కేకలు వేయగా, నర్సులు, బాలింతల బంధువులు అతన్ని అడ్డుకుని వార్డు తలుపులు వేశారు. మహిళల కేకలు విన్న సెక్యూరిటీ గార్డులు అక్కడికి చేరుకుని సూపరింటెండెంట్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకున్న పోలీసులు మహమ్మద్ ఇలియాజ్‌ను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నా బిడ్డే అనుకున్నా...

బిడ్డను ఎందుకు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించావని పోలీసులు ఇలియాజ్‌ను ప్రశ్నించారు. అయితే ఆ చిన్నారి తన బిడ్డే అనుకున్నానని ఆయన తెలిపాడు. తన భార్య షేక్ నిస్సా రెండు రోజుల క్రితం ఇదే బెడ్‌పై కాన్పు అయిందని, తనకు, తన భార్యకు మధ్య మాటలు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చి బిడ్డను ఎత్తుకున్నట్లు వెల్లడించాడు. దీంతో పోలీసులు మోడల్ కాలనీలోని ఇలియాజ్ భార్య వద్దకు వెళ్లి విచారించగా, అతను చెప్పింది వాస్తవమేనని తేలింది. అయితే అతను వచ్చింది నిజంగా తన బిడ్డను ఎత్తుకెళ్లడానికా, లేక ఆస్పత్రిలో ఉన్న బిడ్డను ఎత్తుకెళ్లడానికి అన్నది తేల్చాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన విద్యుత్ తీగ


మృతి చెందిన పెన్నోబిలేసు

మడకశిర: ద్విచక్రవాహనదారుడిపై ఉన్నపళంగా విద్యుత్ తీగ తెగిపడటంతో ప్రాణం కోల్పోయాడు. మడకశిరలో ఈ సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చౌటిపల్లి బీసీ కాలనీకి చెందిన పెన్నోబిలేసు (50) శనివారం ద్విచక్రవాహనంలో మడకశిరకు వచ్చారు. పని ముగించుకుని తిరుగుపయనమయ్యాడు. యాదవ కల్యాణమండపం వద్దకు చేరుకోగానే ఈదురు గాలులకు 11 కేవీ విద్యుత్ లైన్ వైరు తెగి మీదపడటంతో పెన్నోబిలేసు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృత దేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపారు.

జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం రూరల్: జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ (16 ఏళ్ల లోపు బాల బాలికలు) జట్టు ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. శనివారం ధర్మవరం జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించారు. 90 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. హిందూపురం ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, ధర్మవరం జీవన్‌జ్యోతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాకతీయ ఇంగ్లిష్ మీడియం స్కూల్, వంశీకృష్ణ, హిందూపురం అంబేడ్కర్ గురుకులపాఠశాల, పెనుకొండ ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఆగస్టు నుంచి 12 వరకు కుప్పంలో జరిగే అంతర్ జిల్లా చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీలు మల్లికార్జున, రేణుక, రూపా, గణేష్, రాజేష్, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు షెక్షావలి, నాగేంద్ర, బడిమల మోహన్, జిల్లా ఇన్‌చార్జ్ జింక ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ పరిమళం అనంతం


- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా కవులు, రచయితలు
- పలు పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా వీరి రచనలు

"ఏ తపస్వి జీవించెనో యీ మనోజ్ఞ
సీమ, పూజ్యమౌ అనంత సీమలోన
నాటి రుషి వాటికల శోభనందపరచు
ప్రకృతి మాధుర్య మొలుకు పల్లెలిచట.."

అని మధుర కవి బెళ్లూరు శ్రీనివాసమూర్తి కీర్తించినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎందరో సాహితీవేత్తలు, కవులు, రచయితలు సాహితీ సుగంధాలను విశ్వవ్యాప్తం చేశారు. అనంత వాసుల గ్రంథాలను ఎన్నో విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా చేర్చాయి. కాలానుగుణంగా రూపం మారినట్లే వస్తువూ మారుతూ వస్తోంది. ఒకనాటి ఆధ్యాత్మిక బాటను వీడి వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ప్రభావం సాహితీకారులపై, విమర్శకులపై బలంగా ఉండడంతో జిల్లా కవులు, రచయితలు తెలుగు సాహితీ యవనికపై తమ కవనంతో ప్రజ్వలిస్తూ జిల్లాకు మరింత ఖ్యాతిని తెస్తున్నారు. 'అనంత'నే కార్యక్షేత్రంగా మార్చుకున్న రాచపాళెం వంటి సాహితీ దిగ్గజాలు జాతీయ వేదికలపై జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తూ సీమ సాహితీ, చారిత్రక అంశాలు పాఠ్యాంశాలుగా మారడానికి కృషి చేస్తున్నారు. వారిలో కొందరు అమరులైనా తెలుగువారి హృదయాలలో చిరస్థాయి ముద్రవేశారు. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం వారి కృషిని ప్రత్యేకంగా గుర్తించి వారి రచనలను పాఠ్యాంశాలుగా చేర్చింది.

– అనంతపురం కల్చరల్:

బాలలు మెచ్చే కవి కోగిర


కోగిర జైసీతారామ్


బాలల సాహితీ లోకానికి మధుర గేయాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కవికాకి కోగిర జైసీతారామ్ రచించిన 'ఇల్లు–ఈగ' గేయం 1వ తరగతిలో, 'మ్యావ్ మ్యావ్' గేయం 2వ తరగతిలో పాఠ్యాంశంగా చేర్చారు. మహాకవి శ్రీశ్రీనే మెప్పించిన కోగిర జైసీతారామ్ రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన వారు. సాహిత్యంతో పాటూ కళాకారుడు, గొప్ప చిత్రకారుడు కూడా కావడం విశేషం.

సీమ ఆత్మకు ప్రతిరూపం


విద్వాన్ విశ్వం

నిఖార్సైన సీమ కవిత్వానికి ప్రతిరూపంగా నిలిచిన విద్వాన్ విశ్వం అసలు పేరు విశ్వరూపాచారి. శింగనమల నియోజకవర్గం తరిమెల గ్రామానికి చెందిన వారు. కవిగా, రచయితగా, పత్రికా సంపాదకుడిగా, రాజకీయవేత్తగా చిరపరిచితులైన విద్వాన్ విశ్వం కలం నుంచి జాలువారిన ప్రసిద్ధ గేయం 'పెన్నేటి పాట' కవితను 5వ తరగతిలో పాఠ్యాంశంగా పెట్టారు. 'ఎందుకెండిపోయెనో నా పెన్నా' అంటూ అందరినీ ఆలోచింపజేసిన కవిత్వంతో ఎంతో ప్రసిద్ధులయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాళ్లపల్లి


రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ

సంగీత సాహిత్యాలలో ప్రసిద్ధులైన రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ కంబదూరు మండలం రాళ్లపల్లిలో జన్మించారు. 'సారస్వతాలోకము' అన్నమాచార్యులు కృతుల స్వరకల్పన, వేమనపై విమర్శనా గ్రంథం వంటి రచనలు చేశారు. ఆయన రాసిన శ్రీ శాలివాహన గాథా సప్తశతిసారం' చదవడం ద్వారా విద్యార్థులు సత్ప్రవర్తన అలవరచుకుంటారన్న ఉద్దేశంతో 7వ తరగతి విద్యార్థులకు 'నైతిక విలువలు' పేరిట పాఠంగా పెట్టారు.


అనంత సాహితీ సింగం


సింగమనేని నారాయణ

అనంత తొలి కథకుడిగా పేరొందిన సుప్రసిద్ధ కథా రచయిత సింగమనేని నారాయణ బండమీదపల్లి గ్రామంలో జన్మించారు. సీమ కథలు, జూదం, అనంతం, సింగమనేని కథలు పేర్లతో అనేక సంపుటాలను వెలువరించారు. ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డునందుకున్న సింగమనేని నారాయణ రచించిన 'అనంతం' కథల సంపుటిలోని కథ పయనం పాఠాన్ని ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు చదువుతున్నారు.


రాచపాళెం చంద్రశేఖరరెడ్డి కవిత 9వ తరగతి వాచకంలో

రాచపాళెం కృషి స్ఫూర్తిదాయకం



విశిష్ట రచనా శైలితో తెలుగు సాహిత్యానికే వన్నె తెచ్చిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డిది అనంత సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం. అనేక సందర్భాలలో పాఠ్యప్రణాళిక సభ్యుడిగా సంపాదక మండళ్లలో వివిధ హోదాలలో పనిచేసిన ఆయన రాయలసీమ సాహిత్యం పాఠ్యాంశాలుగా రావడానికి కృషి చేయడమే కాదు దాదాపు పోరాటమే చేశారు. 1985లోనే ఆయన డిగ్రీ తెలుగు వాచకం తయారీ సంఘ సభ్యుడిగా పాతతరం సాహిత్యంతో పాటూ ఆధునిక సాహిత్యం విరివిగా వచ్చేలా స్వయంగా వ్యాసాలు రాశారు. 1996లో తెలుగు శాఖలో పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా ఎం.ఏ తెలుగులో రాయలసీమ సాహిత్యం పాఠ్యాంశంగా వచ్చేలా చేశారు. 2005–2007 మధ్య అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేసిన ఆయన సంస్కృతాన్ని గౌరవిస్తూనే తెలుగు నిర్బంధంగా బోధించాలని ఎంతో మందిని ఒప్పించారు. 2012లో 6, 7, 8, 9 తరగతుల వాచకాలలో సీమకు ప్రాతినిధ్యం కోసం పెద్దలను ఒప్పించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు ఆయన సలహా మేరకు వేమన, పోతులూరి వీరబ్రహ్మం పద్యాలను ప్రధానంగా చేర్పించారు. ప్రధాన సంపాదకుడిగా రాయలసీమ పాఠాలకు పెద్ద దిక్కుగా వ్యవహరించారు. ప్రస్తుత 9వ తరగతి విద్యార్థులు ఆయన రాసిన 'మా నాయన' కవితను చదువుతున్నారు.

విభిన్న వ్యక్తిత్వం చిలుకూరి సొంతం


చిలుకూరి దేవపుత్ర

విభిన్నమైన, నిరాడంబరమైన జీవన విధానంతో గొప్ప రచయితగా కీర్తికెక్కిన చిలుకూరి దేవపుత్ర కాల్వపల్లెలో జన్మించారు. ఆయన రచించిన 'మమకారం' పాఠం ప్రస్తుతం 6వ తరగతి తెలుగువాచకంలో ఉంది. వంకరటింక, ఆరుగ్లాసులు వంటి కథా సంపుటాలతో పాటూ ప్రసిద్ధి చెందిన 'పంచమం' వంటి నవలలను తెలుగుజాతికి అందించారు. గుర్రం జాషువా, చాసో పురస్కారాలనందుకున్న ఆయన వ్యక్తిత్వంతోనే అనంత అభిమానుల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

అవధాన సార్వభౌముడు ఆశావాది


ఆశావాది ప్రకాశరావు

అత్యంత కష్టతరమైన అవధాన విద్యను మరింత సులభతరం చేసి తెలుగు సాహిత్యంలోనే విశేష గుర్తింపు పొందిన ఆశావాది ప్రకాశరావు శింగనమల మండలం కొరివిపల్లెలో జన్మించారు. 171 అవధానాలను వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఆయన 2021లో 'పద్మశ్రీ' అందుకున్నారు. అవధాన ప్రక్రియలోని అనేక మెలకువలను ముఖాముఖిగా 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చారు.

అనంత సాహితీ పరిశోధకుడు


ఆచార్య గంగప్ప

ఆచార్య ఎస్.గంగప్పగా పేరొందిన శ్రీరామప్పగారి గంగప్ప పెనుకొండ తాలూకా నల్లగొండ్రాయనిపల్లెలో 1936లో జన్మించారు. సాహిత్య సుధ, సాహిత్యానుశీలన, క్షేత్రయ్య పద సాహిత్యం, జాతికి ప్రతిబింబం జానపద సాహిత్యం వంటి రచనలు చేశారు. ఈయన కలం నుంచి జాలువారిన సాహిత్యానుశీలన గ్రంథం నుండి 'సూక్తి సుధ' పేరుతో 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు నందుకున్న సాహితీ దిగ్గజానికి మరింత గౌరవం తెచ్చారు.

పట్టణ సుందరీకరణకు కృషి


అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పెనుకొండ పట్టణ సుందరీకరణకు కృషి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. ఇందుకు ప్రజల సహకరించాలని కోరారు. మంత్రి శనివారం పెనుకొండలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత పోర్‌లైన్ రోడ్డు మధ్య డివైడర్‌లో మొక్కలు నాటారు. పట్టణంలో సుందరీకరణ పనులు చేపడతామన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. తర్వాత ఆర్టీసీ బస్టాండ్ సమీపాన దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మా జ్యోతిబా పూలే స్కూల్‌ను తనిఖీ చేశారు. కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని సేవలో కర్ణాటక జడ్జి


లోకాయుక్త జడ్జికి స్వామిచిత్ర పటం అందజేస్తున్న అర్చకులు

కదిరిటౌన్: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక లోకాయుక్త జడ్జి వీరప్ప కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ మర్యాదలతో జడ్జికి ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి చిత్ర పటాన్ని బహుకరించారు.

నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చిన్నారి స్కందన్‌కు చోటు


చిన్నారి స్కందన్ కార్తికేయను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఫ్లాష్ కార్డులను గుర్తించడంలో చిన్నారి స్కందన్ కార్తికేయ నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకోవడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి శాంతి కుమారుడు నందన్ కార్తికేయ (వయసు 4 నెలలా 19 రోజులు) 244 ఫ్లాష్ కార్డులను (కూరగాయలు, రంగులు, జంతువులు, పండ్లు, పక్షులు, వాహనాలు, స్వాతంత్ర్య సమరయోధులు, తదితర) గుర్తించడంలో అతి చిన్న వయస్కునిగా నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. కలెక్టర్‌ను శాంతి, హేమంత్‌కుమార్ దంపతులు తమ కుమారుడు కార్తికేయతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా చిన్నారిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులోనూ చిన్నారికి మంచి ప్రోత్సాహం ఇవ్వాలని చెప్పారు.

స్థల వివాదంపై ఆర్డీఓ విచారణ


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

గోరంట్ల: గుంటిపల్లి ప్రాథమిక పాఠశాల స్థల వివాదంపై ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి శనివారం విచారణ చేపట్టారు. ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి పాఠశాల స్థలాన్ని తన పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని గ్రామస్తులు రెండు రోజుల కిందట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శనివారం గుంటిపల్లి గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల సర్వే నంబర్ 510–2బీలో ఉన్నట్లు గుర్తించారు. 510 సర్వేనంబర్‌లో మొత్తం 10–73 సెంట్ల భూమి సుబ్బయ్య అనే వ్యక్తి పేరిట డైక్లాట్‌లో ఉంది. 1998లో సదరు భూమిని సబ్ డివిజన్ చేసి 510–2బీలో 1–13 సెంట్లు భూమి ప్రభుత్వం సేకరించినట్లు విచారణలో వెల్లడైంది. అయితే అప్పటి అధికారులు దీనిని ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో పొందపరచలేదు. రికార్డులు లేనందున పాఠశాల భూమిని ఈశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్‌లో ఎక్కించుకొన్నట్లు విచారణ అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. అయితే ఈశ్వర్‌రెడ్డి డైక్లాట్‌లోని వ్యక్తి వారసుడా కాదా అనే అంశం విచారణ చేస్తామని చెప్పారు. అదేవిధంగా పలువురు రైతులు 50 ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూములను సైతం ఈశ్వర్‌రెడ్డి తన పేరిట ఈ నెల 22న పాసుపుస్తకాలు చేసుకున్నట్లు అందిన ఫిర్యాదుపైనా విచారణ చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. రికార్డులు పూర్తిగా పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

హౌసింగ్ ఏఈ ఆత్మహత్యాయత్నం

- అధికారుల వేధింపులే కారణమని భార్య ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హౌసింగ్ ఏఈ బాలాజీ | బాలాజీ సతీమణి వనిత

ధర్మవరం అర్బన్/అనంతపురం మెడికల్: హౌసింగ్ ఏఈ అన్నం బాలాజీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ధర్మవరం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో శనివారం తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగడంతో తోటి ఉద్యోగులు గమనించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అధికారుల వేధింపుల వల్లే తన భర్త ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు బాలాజీ భార్య వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలాజీ సుమారు నాలుగేళ్ల పాటు ధర్మవరం హౌసింగ్ ఏఈగా పనిచేశారు. కొన్ని రోజుల క్రితం ఆయన్ను జిల్లా కేంద్రంలోని హౌసింగ్ పీడీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అటూ ఇటూ తిరగలేనని, ధర్మవరం లోనే పోస్టింగ్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు సమాచారం. పోస్టింగ్ విషయంలో జాప్యం జరగడంతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కాగా.. రెండు నెలలుగా హౌసింగ్ పీడీ శంకర్‌నారాయణ, డీఈ శంకర్‌లాల్, ముగ్గురు కిందిస్థాయి ఉద్యోగులు తన భర్తను వేధిస్తున్నారని, ముఖ్యంగా డీఈ భారీగా డబ్బు డిమాండ్ చేశారని బాలాజీ భార్య వనిత ఆరోపించారు. వారు అడిగిన మొత్తం ఇవ్వనందుకే ఎటువంటి కారణం చెప్పకుండానే పీడీ ఆఫీసుకు అటాచ్ చేశారన్నారు. రాప్తాడులో ఏఈగా ఉన్న ఓ వ్యక్తి కోసం తన భర్తను ఇబ్బందులకు గురి చేశారన్నారు. అధికారుల వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు.

ఉజ్వల భవితకు నాలుగేళ్లు కీలకం

- బీటెక్‌లో చేరిన మొదటి రోజు నుంచే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి
- ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హేమచంద్రారెడ్డి

అనంతపురం/ బుక్కరాయసముద్రం: ఉజ్వల భవిష్యత్తుకు నాలుగేళ్ల బీటెక్ కోర్సు చాలా కీలకమని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. ఎస్‌ఆర్‌ఐటీలో శనివారం ఆరంభ్– 2024 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మంచి ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేసుకోవడంతోనే బాధ్యత తీరిపోయింది అనుకోకుండా కోర్సులో అడ్మిషన్ పొందిన తొలి రోజు నుంచి ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వృథా చేసుకోకుండా, చదివే అలవాటు పెంపొందించుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. తమలోని బలహీనతలు, భయాన్ని అధిగమించి ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఎస్‌ఆర్‌ఐ సంస్థ సలహాదారు ఈఎస్ చక్రవర్తి (మాజీ టీసీఎస్ గ్లోబల్ హెడ్) మాట్లాడుతూ జీవితంలో ఏది కోల్పోయినా ..వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఉంటే అదే మనల్ని ఉన్నతస్థానంలో నిలుపుతుందన్నారు. ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ తమను నమ్మి ఈ కళాశాలలో చేర్పించిన తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ, డీన్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు అమ్మకు అంకితం


మొక్కలు నాటుతున్న డీఈఓ

లేపాక్షి: మండల కేంద్రం లేపాక్షిలోని నవోదయ విద్యాలయం, ఎంజేపీ ఏపీ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఉదయం డీఈఓ మీనాక్షి పరిశీలించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 'అమ్మ' పేరుతో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి అమ్మకు అంకితం ఇచ్చారు. కేజీబీవీలో పరిసరాలను పరిశీలించి వంటగది, నీటి కొళాయిలు, కూరగాయలను పరిశీలించారు. అదే విధంగా కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పి.సడ్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు.